


# బ్లాంక్ పేపర్

— వేదుల మీనాక్షీదేవి

టింగ్, టంగ్—

విశ్వం ఖంగారుపడ్డాడు గంటలు విని.

ఎదురుగుండా ప్రశ్న పత్రం, తను వ్రాయవలసిన అన్సరు పుస్తకం వున్నాయి.

'అబ్బా! అప్పుడే రెండుగంటలయిందీ!' అనుకున్నాడు.

విశ్వం కళ్ళు ఎర్రగా వున్నాయి.

తెల్లవార్లూ నిద్రలేకుండా చదివాడు. కాని, యింతవరకు ఒక్క అక్షరం కూడా వ్రాయలేదు.

ఇచ్చిన ప్రశ్నలకి యిందాకటి నుండి సమాధానం ఆలోచిస్తున్నాడు. కాని, తండ్రి సుబ్రహ్మణ్యం మరణశయ్యమీద చినిగిన గుడ్డలూ, పాలిపోయిన ముఖం, మాసిన గడ్డమూ కండ్లకు గోచరిస్తున్నాయి.

*

సుబ్రహ్మణ్యం మిడిల్ స్కూలు మేష్టరు. స్కూల్లో ఇంక్రిమెంట్లు సరిగా యివ్వని అధికారి ఒక పుణ్య జనుడు. పిత్రార్జితం ఏమీ లేదు. అతనికి ఒక్కగానొక్క కొడుకు విశ్వం. సుబ్రహ్మణ్యం పెద్ద చదువు చదవలేకపోయాడు. అందుచేత తన కొడుకును ఎం. ఎ. ప్యాసు చేయించాలి. ఎంత కష్టపడైనా సరే అనుకున్నాడు. పిల్లవాడికి అయిదో సంవత్సరం రాగానే అక్షరాభ్యాసం చేసి అయిదు క్లాసుల వరకు తనే యింటివద్ద చెప్పి. ఆపై క్లాసులో వేయించాడు స్కూల్లో.

ఇదివరకు సుబ్రహ్మణ్యం జీతంతో అతను, భార్య, కొడుకు ఎలాగో కాలక్షేపం చేయగలిగేవారు. విశ్వం హైస్కూలు చదువైపోయింది. కాలేజీలో ఇంటర్ మీడియేట్ చదువుతున్నాడు. సొమ్ము లేక ఆఖరిపెర్మ జీతం కట్టకపోవడం వల్ల పేరు కొట్టివేసే పర్యంతం అయింది. సుబ్రహ్మణ్యం అడగరానివాళ్ళనడిగి, పట్టరానివాళ్ళ కాళ్ళు పట్టుకుని బదులు తెచ్చి కట్టడం జరిగి నిండా నెల కాలేదు....ఆ బాకీ యింకా తీర్చలేదు....ఇంతలో పులిమీద పుట్రలాగా పరీక్ష దరఖాస్తు ఒకటి వచ్చి పడింది. ఏమీ తోచలేదు చివరికి. తన భార్య మెడలో వున్న ఒక్క పుస్తెలనానూ ఆమెను పసుపు కొండు కట్టుకోమని చెప్పి, తాకట్టుపెట్టాడు. ఆ సొమ్ము తెచ్చి దరఖాస్తు కట్టి మిగిలినది అప్పు తీర్చాడు సుబ్రహ్మణ్యం.

విశ్వం ప్యాసయ్యాడు!

బి. ఏ. లో ప్రవేశించాడు!

ఇది వరకు సుబ్రహ్మణ్యం ఉదయం, సాయంత్రం పర్మిషన్‌తో రెండూ; దాటుగా నాలుగూ ప్రైవేట్లు చెప్పుకునేవాడు. తనూ, భార్య ఒక్క పూట తిని కొడుక్కి కడుపునిండా పెట్టి కాలక్షేపం చేస్తున్నారు. కాని, ఆ విధంగా కూడా గడవడం కష్టంగా వుంది. ఒక షావుకారు దగ్గిరకి వెళ్ళి రోజూ సాయంత్రం ఆరుగంటలకు షాపులోని యే రోజు పద్దులు ఆ రోజు వ్రాసి పెట్టడానికి ఒప్పుకున్నాడు. ఆ పద్దులు వ్రాసి వచ్చేటప్పటికి రోజూ రాత్రి పదిగంటలయేది. ఇదివరకు యెప్పుడైనా నడవలేకపోతే రిక్షా కట్టించుకునేవాడు ...ఇప్పుడు యెంత బాధగా వున్నా, దూరమైనా నడకే శరణ్యం. పగలల్లా పాఠాలు చెప్పి చెప్పి వచ్చిన సుబ్రహ్మణ్యానికి కడుపునిండా తిండిలేదు. కాని, ఈ కష్టమేదీ సుబ్రహ్మణ్యానికి కనబడడం లేదు. అతని దృష్టి అంతా విశ్వం చదువు మీద కేంద్రీకరించబడి వుంది. ఒక్క రెండున్నర సంవత్సరాలు కష్టపడితే కొడుకు యం. ఎ. పాసవుతాడు. తన కష్టాలు గట్టెక్కిపోతాయి. ఇలాగ అనుకుంటూ తృప్తిపడేవాడు.

సుబ్రహ్మణ్యం మనస్సెంతో తేలికపడ్డట్లనిపించేది అలాంటప్పుడు.

తిండి పుష్టిలేక సుబ్రహ్మణ్యం వెనకటి ఆరోగ్యం కోల్పోతున్నాడు ..... నీరసించాడు.... గుండెలార్చుకుని పోతున్నాయి.

కొద్దిగా దగ్గు!!

దగ్గే కదా అదే పోతుందనుకున్నాడు.

ఆ దగ్గు యెక్కువై జ్వరం కూడా వస్తోంది.

'నాన్నగారూ...నేను చదువు మానేసి ఏదైనా ఉద్యోగం సంపాదిస్తాను. మీరు కష్టపడలేరింక. మన యిబ్బంది తీరుతుంది. ప్రైవేటుగా ఒక్కొక్క—టే కట్టి పరీక్ష ప్యాసవుతాను' అన్నాడు విశ్వం.

అనేక విధాల బ్రతిమాలాడాడు.

ఊఁ హూఁ. ససేమిరా—ఒప్పుకోలేదు తండ్రి.

ఇక కష్టపడ్డన్నాళ్ళు కష్టపడక్కర్లేదు అన్నాడు.

బి. ఏ. పరీక్షలు ఇక మూడు నెలలున్నాయి.

సుబ్రహ్మణ్యానికి దగ్గు, జ్వరం ఎక్కువై పోయింది.

ఆసుపత్రికి తీసుకువెళ్ళి డాక్టరుకి చూపించాడు తండ్రిని విశ్వం. డాక్టరు పరీక్షచేసి టి. బి. అని తేల్చాడు. వెంటనే క్షయాసుపత్రికి తీసుకువెళ్ళితే బ్రతుకుతాడని చెప్పాడు.

చేతిలో దమ్మిడీలేదు. రేపు ఎలా గడుస్తుందా అనుకోని రోజులేని సంసార పరిస్థితిలో వైద్యం ఎలా చేయించడం?

సుబ్రహ్మణ్యం వైద్యం వద్దన్నాడు.

గోరంత ఆయుర్దాయం వుంటే ఏం ఫరవా లేదన్నాడు.

భగవంతుడే వున్నాడనుకున్నాడు.

కొద్దిరోజులలోనే మంచం పట్టాడు సుబ్రహ్మణ్యం.

ఆ నాటి రాత్రి పరిస్థితి చాలా విషమించింది.

విశ్వం, తల్లి కొయ్యబొమ్మల్లాగ నిలబడి వున్నారు.

'మా నాన్నగారికి ప్రాణభయం లేదు కదా?' అన్నాడు విశ్వం.

'ఎబౌట్ హాఫెనవర్ మోర్' అన్నాడు నిరాశగా పెదవి విరుస్తూ డాక్టరు.

*

'హాఫ్ ఎన్ అవర్ మోర్' అన్నాడు హాల్ సూపరింటెండెంటు.

విశ్వం ఆయన మీద లోపల విసుక్కున్నాడు.

ఇంతవరకు విశ్వం ఒక్క అక్షరమైనా వ్రాయలేదు. ఈ అరగంటలోనైనా వ్రాస్తే కొన్ని మార్కులు పడవచ్చు అనుకుని తన చుట్టు ప్రక్కల యిటూ అటూ చూశాడు. ప్రక్క విద్యార్థులు వంచిన తల యెత్తకుండా వ్రాస్తూండడం గమనించాడు....తనూ వ్రాయ నిశ్చయించుకున్నాడు.

ప్రశ్న పత్రంకేసి తీక్షణంగా చూశాడు.

ఇటూ అటూ వ్రాస్తున్న విద్యార్థుల్ని చూశాడు. ప్రక్కవాడి పుస్తకంలోకి చూశాడు.

'అర్థ శాస్త్రానికి, నైతిక ప్రవర్తనకు గల సంబంధమును చర్చింపుము' అనే ప్రశ్నకు 'ఆర్థిక సౌష్ఠవం లేకపోవడంవల్ల నైతిక ప్రవర్తన కుంటు పడుతుంది' అనే వాక్యం జవాబుగా వ్రాస్తున్నాడు ఆ విద్యార్థి.

ఆ రెండు ముక్కలూ కాపీ చేద్దామనుకున్నాడు విశ్వం.

కలం ముందుకి రాలేదు.

'ఛీ' అనుకున్నాడు.

తనలోని నైతిక ప్రవర్తన యింత తగ్గిపోవడము, తను కాపీ చెయ్యడానికి సిద్ధమవడమూ తనకు ఆర్థిక సౌష్ఠవం లేకపోవడంవల్లనే కదా అనుకున్నాడు. కాపీ చెయ్యాలన్న నీచమైన ఊహ అతనికి అంతవరకెన్నడూ కలగలేదు. ..నీతి, నియమం, సత్యం, ధర్మం యివన్నీ వుండాలని చెప్పే వారంతా ఆర్థికంగా గొప్పవారై వుండాలి—అనుకున్నాడు విశ్వం.

డాక్టరు చెప్పినట్లే అరగంటకి చనిపోయాడు సుబ్రహ్మణ్యం. భార్యనీ, కొడుకునీ దిక్కులేని వారిని చేసి 'మీ అమ్మ నాతోబాటు కష్టపడింది. నీ తల్లిని జాగ్రత్తగా చూసుకో. నీ చదువు పూర్తి కావడం చూడలేకపోయాను' అని విశ్వంతో కడసారిగా మాట్లాడాడు. జాలిగా కొడుకును చూస్తూ రెండే రెండు కన్నీటిబొట్లు రెండుచెంపల మీదుగా జారాయి సుబ్రహ్మణ్యానికి.

విశ్వం కళ్ళనుంచి రెండు కన్నీటి చుక్కలు రాలి, చౌకరకపు సిరాతో తన ఆన్సరు బుక్కు మీద వేసిన రిజిస్టరు నెంబరు చెరిగిపోయింది.

ఆ నాటికి తండ్రిపోయి సరిగా నెల అయింది.

విశ్వం తల్లిని పోషించాలి....తను బ్రతకాలి.... అందుచేత యీ పరీక్షలో నెగ్గి తీరాలి.

తండ్రి తన అభివృద్ధి కోసం ఎంత కష్టపడ్డాడు!

చివరికి ప్రాణం కూడా త్యాగం చేశాడు!

తల్లి భర్తలేని దుఃఖంతో కుమిలిపోతోంది యింటిదగ్గర.

విశ్వం కడుపులోంచి వుప్పెనలాగ దుఃఖం పొంగి వస్తోంది. తల వంచుకుని, దుఃఖం అణుచుకుందుకు ప్రయత్నం చేస్తున్నాడు.

గంట కొట్టారు....

విద్యార్థుల వద్ద జవాబు పత్రాలు తీసుకుంటూ ఇన్విజిలేటరు వచ్చారు విశ్వం దగ్గిరకి.

విశ్వం తన బ్లాంక్ పేపరు ఆయనకిచ్చి బైటకు వెళ్ళిపోయాడు కాళ్ళీడ్చుకుంటూ.... *



★ ఇంట్లో ఒక గదిలో నల్లుల బాధ ఎక్కువగా ఉందనుకోండి. అలాంటి గదులలో వేపాకులు కావి, గంధకం కావి కాలిస్తే, క్రమేణా నల్లులు నశిస్తాయి.



★ గాజు గ్లాసులో వేడివేడి టీకాఫీ; కాఫీకాఫీ పోసే ముందు, అందులో ఒక స్పూను వేస్తే మంచిది. ఇలా చెయ్యడంవల్ల స్పూను వేడిని పీల్చుకుని, గ్లాసు బద్దలు కాకుండా కాపాడుతుంది.



★ కత్తెరల వాడి తగ్గిపోయిందని విచారపడ నక్కరలేదు. ఒక చిన్న సీసా తీసుకుని, దాని మెడను ఆ కత్తెరతో వేగంగా పది పదిహేనుసార్లు కత్తిరించేలా కదిపితే-కత్తెర 'వాడి' మళ్ళీ పెరుగుతుంది.